# గురుదక్షిణ

## ఆనందరావు పట్నాయక్

తెల్లవారుతోంది... మంచు తెరలు నెమ్మదిగా కరుగుతున్నాయి. మంచు తెరలను చీల్చుకుంటూ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చి ప్లాట్‌ఫాం మీద ఆగింది. ఎక్కే జనం, దిగే జనంతో త్రీ టైర్ కంపార్ట్‌మెంట్ రద్దీగా ఉంది. డోరు దగ్గర పెట్టె మీద ఒక వృద్ధుడు కూర్చుని ఉన్నాడు. చేతులతోనే చుట్టూ తడుముతూ తనమీద ఎవరూ పడకుండా జాగ్రత్త పడుతున్నాడు. వృద్ధాప్యంతో పాటు అంధత్వం అతన్ని బాధిస్తోంది. ఖద్దరు పంచె మీద జుబ్బా వేసుకున్నాడు.

'రొట్టెలు తీసుకోండి' రెండు రొట్టెలు ఆ ముసలాయన చేతిలో పెట్టి ఓ వ్యక్తి వెళ్ళిపోయాడు.

'బాబూ' అల్లుడుగారూ!' పిలిచాడు ఆ ముసలాయన.

ఆ వ్యక్తి వినిపిస్తున్నా పట్టించుకోకుండా వెళ్ళి సీట్లో కూర్చున్నాడు. ముసలాయనతో ప్రయాణం అతనికి ఏ మాత్రం ఇష్టం లేనట్లుంది.

రైలు కదిలింది.

అల్లుడు తన పిలుపు విని వస్తున్నాడేమోనని ఎదురుచూసిన ఆ ముసలాయన అటువంటి అలికిడి వినిపించకపోవడంతో రొట్టెలు తినడానికి ప్రయత్నించాడు. ఇంతలో టాయ్‌లెట్‌లోంచి ఒకాయన విసురుగా బయటికొచ్చి ముసలాయన్ని ఢీకొన్నాడు. రొట్టెలు రెండూ కిందపడిపోయాయి.

'సారీ!' అని చెప్పి ఆ ప్రయాణీకుడు ముందుకు కదిలాడు.

'పోనీలే నాయనా!' ఎవరికెంత ప్రాప్తమో...' ముసలాయన వేదాంతం వల్లించాడు.

కొద్దిసేపటికి కంపార్టుమెంటులో కలకలం!

చెకింగ్ స్క్వాడ్ టికెట్స్ తనిఖీ చేస్తున్నారు.

ఆ స్క్వాడ్‌కు హెడ్‌గా ఓ అధికారి పర్యవేక్షిస్తున్నాడు.

టికెట్స్ లేని ప్రయాణీకుల నుంచి పెనాల్టీతో డబ్బులు వసూలు చేసి రసీదులిస్తున్నారు.

ముసలాయనకి అల్లుడైన ఆ వ్యక్తి జేబులోంచి పాస్ తీసి ఆఫీసర్ చేతికిచ్చి, తనతో పాటు దూరంగా డోర్ దగ్గర కూర్చున్న ముసలాయన్ని చూపించాడు.

స్క్వాడ్ ముందుకు కదిలింది. ఆఫీసర్ మాత్రం కదల్లేదు. అది ఫిజికల్లీ హేండికాప్డ్‌కి ఇచ్చే పాసు.

'హూ ఈజ్ మిస్టర్ కొండయ్య?' ఆఫీసర్ అడిగాడు.

'అదిగో డోర్ దగ్గర కూర్చున్నారు' అల్లుడు ముసలాయన్ని చూపించాడు.



'పాస్ ఆయనది. మీరేమో ఎస్కార్టు. ఆస్క్ హిమ్ టు సిట్ హియర్' హుకుం జారీ చేసినట్లు అన్నాడు ఆఫీసర్.

అల్లుడు మామగార్ని తీసుకువచ్చి తన సీట్లో కూర్చోబెట్టి అతను నిల్చున్నాడు. ఆఫీసర్ ఆ ముసలాయనవైపు ఓసారి పరిశీలనగా చూశాడు. అక్కడ ఏం జరుగుతుందో తెలియని ముసలాయన పరువుల సీట్లో కూర్చుని చెవులు రిక్కించి వింటున్నాడు.

ఆకలితో కడుపు నకనకలాడుతోంది. తన గమ్యం ఎప్పుడు చేరుతాడో? టీ, కాఫీలు తనకు ఎలాగూ అలవాటు లేదు. కనీసం బన్ను ముక్కయినా కడుపులో పడితే బావుణ్ను. కడుపులో ప్రేవులు కరకరలాడుతున్నాయి అనుకుంటూ సీట్లో అసహనంగా కదుల్తున్నాడు.


ఆఫీసర్ కళ్ళల్లో ఆశ్చర్యం. క్షణాల్లో ఒక నిర్ణయానికొచ్చి తన బ్రీఫ్ కేసులో నుంచి లంచ్ బాక్స్ తీసి ముసలాయనకిచ్చాడు.

ముసలాయన ఆత్రంగా అందుకున్నాడు.

బాక్సు తడిమి, నింపాదిగా, నిదానంగా ఓపెన్ చేశాడు. ఇందాకటిలా పొరపాటు జరిగి కింద పడిపోకూడదని బాక్సును గట్టిగా పట్టుకున్నాడు.

## డిమాండ్‌లో నితిన్

‘జయం’ చిత్రంతో వెండితెరకు పరిచయమైన హీరో నితిన్ ఆ తరువాత నటించిన ‘దిల్’ సినిమా కూడా సూపర్ హిట్ అవడంతో అతనికి మంచి డిమాండ్ ఏర్పడింది. దీన్ని పూర్తిగా వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో నితిన్ అధిక మొత్తంలో రెమ్యూనరేషన్‌ను డిమాండ్ చేస్తున్నాడు. కృష్ణవంశీ సినిమా శ్రీ ఆంజనేయంకు 80 లక్షలు, రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి కోటి రూపాయల పారితోషికాన్ని తీసుకుంటున్నట్లు టాలీవుడ్ భోగట్టా. నేటి యువతరం కథానాయకులలో అత్యధిక పారితోషికాన్ని అందుకుంటున్న హీరో నితిన్.



లంచ్ బాక్సులో టిఫిన్‌తో పాటు పచ్చడి కూడా ఉందని గ్రహించాడు. పచ్చడి నాలుకకు రాసుకుని చప్పరించాడు కారం. గొడ్డుకారం! నషాళానికెక్కింది. టిఫిన్ నోట్లో పెట్టుకున్నాడు. జొన్న సంకటి. ఎప్పుడో ఎక్కడో తిన్న జ్ఞాపకం. ఏవో స్మృతులు మదిలో మెదులుతున్నాయి.

‘ఎవరు ఇచ్చారిది?’ అడిగాడాయన.

‘నేనే మాస్టారూ!’ అన్నాడు ఆ ఆఫీసర్.

‘కొండ్రావ్... కొండవలస...’ తనలో తనే గొణుక్కుంటున్నట్లు పైకే అనేశాడు ముసలాయన.

‘అవును మాస్టారూ! నేనే! గుర్తు రావడంలేదా?’ ముసలాయన చేతులు పట్టుకున్నాడు ఆఫీసర్. అతని కళ్ళు వర్షిస్తున్నాయి. కన్నీళ్ళు బొట్లు బొట్లుగా ముసలాయన చేతులమీద పడి గతంలోని స్మృతులకు ఆకృతినిస్తున్నాయి.

కంపార్టుమెంట్‌లోని స్క్వాడ్, ప్రయాణీకులు ఆసక్తిగా వారిద్దరి వైపే చూస్తున్నారు. అంత పెద్ద ఆఫీసరు ఆ వృద్ధుని చూసి కంట తడి పెట్టుకోవడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

‘కొండ్రావ్! నువ్వేనా?’ ముసలాయన జ్ఞాపకాలను తవ్వుకుంటూ వణికే గొంతుతో అన్నాడు.


ఇంతలో స్టాఫ్‌లో ఒకరు మినరల్ వాటర్ బాటిల్ తెచ్చి ఆఫీసర్‌కు అందించారు. ఆ బాటిల్‌ను ముసలాయనకు ఇచ్చాడు ఆఫీసర్.

‘ఎస్! ప్రొసీడ్! డూ యువర్ డ్యూటీ’ అని స్టాఫ్‌ని ఆదేశించాడు.

స్టాఫ్ మంత్రముగ్ధుల్లా ముందుకు కదిలారు.

‘కొండ్రావ్! ఏం చేస్తున్నావ్? ఎక్కడుంటున్నావ్?’ మాస్టారు ప్రశ్నించారు.

‘మాస్టారూ! నేను రైల్వేలో ఆఫీసర్‌గా ఉంటున్నాను. విశాఖలో ఇల్లు కట్టుకున్నాను. అంతా మీ చలవే. మీ ఆశీర్వాద బలమే’ అంటూ మాస్టారి పక్కనే కూర్చున్నాడు. అప్పటికి మాస్టారు టిఫిన్ తినడం పూర్తి చేశారు. ఎంగిలి పాత్రలు అందుకుని కడగడానికి ముందుకు కదిలాడు కొండ్రావ్. స్టాఫ్‌లో ఒకరు ఆ పాత్రలు కడగడానికి అందుకోబోయాడు. అతన్ని వారించి కొండలరావు వాష్‌బేసిన్ వైపు కదిలాడు. మాస్టారు గతంలోకి వెళ్ళారు.





* * *

కొండవలస.

చాలా చిన్న ఊరు. ఊరికి రోడ్డు లేదు. కరెంటు సౌకర్యం లేదు. గిరిజన గ్రామం.

ఊరు చుట్టూ కొండలు. దట్టమైన చెట్లతో పచ్చగా... హరితవనం మధ్య ఆ చిన్న ఊరు. కొండ అక్కడివారి ఆరాధ్య దైవం. కారణం అక్కడున్నవారిలో అధిక సంఖ్య జనాభా ఆదివాసులు. కొండవల్లే తమ జీవనం గడుస్తుందని వాళ్ళ ప్రగాఢ విశ్వాసం. కొండల్లో పండే జొన్న, రాగులు, తమ పొట్ట నింపుతాయి. కొండల్లో పండే మామిడి, పనస, సీతాఫలం, అరటి అమ్మితే వచ్చే సొమ్ముతో సంతలో ఉప్పు, ఇతర దినుసులు, కిరసనాయిలు కొనుక్కుంటారు. కొండలమీదున్న చెట్లు కావలసినంత కలపను ఇస్తాయి. ఆ కలపతో నిలువ నీడ ఏర్పాటు చేసుకోవచ్చు. చివరకు కన్ను మూస్తే మనిషిని ఆరడుగుల బూడిద చేసేదీ ఆ కట్టెలే! కొండదేవర చల్లగా చూస్తేనే తమ బతుకులు సాఫీగా సాగుతాయని వాళ్ళ నమ్మకం. అందుకే వాళ్ళు పిల్లలకు కొండ అర్థం వచ్చే పేర్లు పెడ్తారు.

గిరిజనాభివృద్ధి సంస్థ పుణ్యమాని ఆ కొండవలసలో ఒక పాఠశాల కూడా వుంది. మాస్టారు ఆ పాఠశాలలో టీచర్. చదివేందుకు పిల్లలెవరూ పాఠశాలకు రారు. వాళ్లు రావాలనుకున్నా వాళ్ళ తలిదండ్రులు చదివించటానికి ఇష్టపడరు. పిల్లల్ని పశువుల కాపలాకు పంపితే నాలుగు కాసులు వస్తాయన్నది వాళ్ళ భావన. దళారులకు తాకట్టు పెట్టిన తమ జీవితాలను విడిపించుకోవడానికి ఆ



## పాపం నేహాధూపియా

నేహాధూపియాకు అమీర్‌ఖాన్ అంటే చచ్చేంత ఇష్టమట. అమీర్‌ఖాన్ 'కయామత్‌సే కయామత్' చూసిన తరువాత నుంచి అమీర్‌ఖాన్ అంటే నేహాకు విపరీతమైన ఇష్టం ఏర్పడింది. నేహా సినిమాల్లోకి రావడానికి కారణం కూడా తన కలల రాజును దగ్గరగా చూసు కోవచ్చన్న ఆశతోనేనట. నేహాధూపియాకు అమీర్‌ఖాన్‌ను పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన ఉండేది. కానీ అమీర్‌కు రీనా దత్తాతో పెళ్ళయిన విషయం ఆలస్యంగా తెలిసి నిరాశపడిందట. జీవితంలో ఇక ఏ వ్యక్తినీ తన భర్తగా అంగీకరించనని కూడా నేహ ఎనౌన్స్ చేసింది. ఆహా ఏమి అమీర్‌ఖాన్ అదృష్టం. పాపం నేహాధూపియా!

నాలుగు డబ్బులు ఉపయోగపడతాయని వాళ్ళ ఆశ.

అటువంటి గ్రామంలో ఒక కుటుంబంలోంచి వచ్చినవాడు కొండడు. చాకులాంటి కుర్రాడు. మట్టిలో మాణిక్యం. వాడికి సానపడితే రాయి రత్నంగా మారినట్లు మంచి పౌరుడిగా మారుతాడని మాస్టారు గుర్తించాడు.

కొండడి తల్లిదండ్రులకు నచ్చచెప్పి తన దగ్గరే ఉంచుకుని అతడ్ని పోషిస్తూ విద్యాబుద్ధులు నేర్పారు. స్కూలు చదువు ముగిసిన తరువాత హైస్కూల్, ఉన్నత చదువులకు కూడా తన ఖర్చుతోనే పంపారు మాస్టారు.

హఠాత్తుగా మాస్టారి భార్య మరణించడంతో ఉన్న ఒక్క కూతురి పెళ్ళి చేయాలన్న తలంపుతో స్వంత ఊరికి వచ్చేశారు.

అంతే! ఆ తరువాత ఇన్నేళ్ళకు కొండలరావు తన ముందు ఇలా ప్రత్యక్షమయ్యాడు. తన శిష్యుడు. కొండవలసలో తను తిన్న జొన్న సంకటి, గొడ్డుకారం, తనకు పాత రోజులు జ్ఞప్తికి తెస్తే కొండడి మాటల్లో ఆప్యాయత, కోటి రాగాలతో ధ్వనిస్తోంది. ఒకనాటి తన దగ్గర విద్యార్థి వామనుడిలా ఇంతలో అంతయినట్లు ఎదిగితే అంతకన్నా ఒక ఉపాధ్యాయుడికి కావలసిందేముంటుంది?

జ్ఞాపకాల్లో కొట్టుకుపోతున్న మాస్టారి పక్కన వచ్చి కూర్చున్న కొండలరావు 'మాస్టారూ! మీ సంగతులు చెప్పండి' అని ఈ లోకంలోకి తెచ్చాడు.

మాస్టారి గుండె గొంతులో కొట్లాడుతోంది. చూపులేని కళ్ళలోంచి నీళ్ళు జారుతున్నాయి. మాట రావడంలేదు.

కొండలరావు నీళ్ళు అందించాడు. తాగి స్థిమిత పడి మాస్టారు చెప్పడం ప్రారంభించారు.

భార్య పోయిన తరువాత, తన ఆరోగ్యం పట్టించుకోకపోవడం, వృద్ధాప్యం, చూపు పోవడం... ఉన్న ఒకే కూతురు ఇద్దరు పిల్లలకు తల్లయి తన తల్లిని వెదుక్కుంటూ వెళ్ళిపోవడం, ఇపుడు తను అల్లుడికి భారంగా వుండడం, ఇష్టంలేక వృద్ధుల ఆశ్రమానికి బయలుదేరడం... అన్నీ వివరించారు మాస్టారు.

జీవిత పాఠాన్ని మాస్టారు బోధిస్తుంటే విద్యార్థిలా విన్నాడు కొండలరావు.

కొండలరావు మాస్టారి అల్లుడికి ఏం చెప్పాడో మరి...

రైలు విశాఖపట్నం స్టేషన్‌లో ఆగగానే మాస్టారితోపాటు కిందికి దిగాడు కొండలరావు. తను నిమిత్తమాత్రుడిలా కొండలరావు వెంట దిగారు మాస్టారు. మామగారికి వీడ్కోలు చెప్పాడు అల్లుడు.

రైలు కదిలింది.

మాస్టార్ని వెంటబెట్టుకుని స్టేషన్ నుంచి బయటికొచ్చాడు కొండలరావు.

బంగాళాఖాతం ఒడ్డున గొప్పింటి ఆడపడుచులా అందంగా వుంది విశాఖ నగరం. ఇద్దరూ టాక్సీ ఎక్కారు.

'అదిగో ఆ కనబడుతున్న ఇంటి ముందు ఆపు' అన్నాడు కొండలరావు.

'కొండయ్య నిలయం' ముందా సార్?' అన్నాడు టాక్సీ డ్రైవర్.

మాస్టారు ఉలిక్కి పడ్డారు... ఇన్నాళ్ళకు.... ఇన్నేళ్ళకు మాస్టారూ... మాస్టారూ... అంటు పిలిచే పిలుపు వెనుక మరుగున పడిపోయిన తన పేరు గుర్తొచ్చి.... కొండయ్య! కొండయ్య నిలయం. మాస్టారు మనసులో జ్ఞాపకాల వెల్లువ... మాస్టారి చెయ్యి పుచ్చుకుని జాగ్రత్తగా టాక్సీ దింపాడు కొండలరావు.

'కొండా!' పిలిచారు మాస్టారు.

'అవును మాస్టారూ! ఇంటికి మీ పేరే పెట్టాను. ఇది మీ ఇల్లే అనుకోండి....' మాస్టార్ని ఇంట్లోకి నడిపించుకెళ్ళాడు కొండలరావు.

దూరంగా ఆలయంలోంచి అన్నమాచార్య కీర్తన వినబడుతోంది. 'కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు...' ❀

## చచ్చినంత పనైంది

సన్నీడియోల్ హీరోగా గుడ్డు ధానో రూపొందిస్తున్న 'జాల్' చిత్రం చిత్రీకరణ సమయంలో తనకు ఎదురైన చావు అనుభవాన్ని నటి టాబు అడగని వాళ్ళకి, అడిగిన వాళ్ళకి చెబుతూ బిజీగా కనిపించింది. మనలిలో ఈ చిత్రానికి సంబంధించిన ఫైటింగ్ సీన్లను అక్కడి మంచు కొండలపై హెలికాప్టర్ ద్వారా చిత్రీకరి స్తున్నారు. భారీగా కెమెరా సామాను ఉన్న ఆ హెలికాప్టర్‌లో టాబుతోపాటు ఫైట్ మాస్టర్ టిను వర్మ, ఇద్దరు స్టంట్‌మెన్లు, పైలెట్ కూడా ఉన్నారు. షూటింగ్ జరుగుతుండగా కొండలపై ఎగురుతున్న హెలికాప్టర్ అంటూ ఇటూ ఊగుతూ పడిపోతున్నట్లు అనిపించడంతో అందులో ఉన్న టాబు ఇక ఆ క్షణంతో అయిపోయానని అనుకుందట. అదృష్టం కొద్దీ పైలట్ అనుభవజ్ఞుడవటంతో బతికి బయటపడినట్లు చెబుతూ దాదాపు చావును అనుభవించానంది. అదండీ విషయం!

